ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025


రాజన్నకు నమస్కరిస్తున్న భక్తులు

పోలింగ్ ప్రశాంతం..

- బ్యాలెట్ బాక్సుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యం
- జిల్లాలో 41 పోలింగ్ కేంద్రాలు.. 185 మంది సిబ్బంది
- 200 మందితో పోలీస్ బందోబస్తు.. కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు
- జిల్లాలో పట్టభద్రుల పోలింగ్ శాతం 68.51 శాతం
- ఉపాధ్యాయుల పోలింగ్ 94.63 శాతం
- పట్టభద్రుల్లో పోలైన ఓట్లు 15,344.. ఉపాధ్యాయ పోలైన ఓట్లు 899
- ఓటింగ్ సరళిపై మొదలైన విశ్లేషణలు

	పట్టభద్రుల నియోజకవర్గం	ఉపాధ్యాయుల నియోజకవర్గం
ఓటర్లు:	3,55,159	27,088
ఓటుహక్కు వినియోగించుకున్నవారు:	2,50,106 (70.42 శాతం)	24,895 (91.9 శాతం)
పురుషులు :	1,62,561	15,743
మహిళలు :	87,544	9,152


స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమవుతున్న భక్తులు


సిరిసిల్లలో బారులు తీరిన ఓటర్లు


సిరిసిల్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల ఎన్నికల్లో 'పోల్' ఫైట్ ముగిసింది. గురువారం అభ్యర్థుల తలరాతను శాసించే విద్యావంతుల ఓటరు తీర్పు బ్యాలెట్ బాక్స్‌ల్లో నిక్షిప్తం అయ్యింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పట్టభద్రుల స్థానంలో 68.51 శాతం, ఉపాధ్యాయ స్థానంలో 94.63 శాతం ఓటు హక్కు నమోదైంది. పట్టభద్రుల స్థానానికి 22,397 మంది ఓటర్లు ఉండగా, 15,344 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 13,772 మంది పురుషులకు 9,523 మంది, 8,625 మంది మహిళలకు 5,821 మంది ఓటు వేశారు. ఉపాధ్యాయ ఓటర్లు 950 మంది ఉండగా, 899 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 677 మంది పురుషులకు 640 మంది, 273 మంది మహిళలకు 259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 41 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు చేశారు. 4 గంటల వరకే పోలింగ్ సమయం ఉన్నా సాయంత్రం 5.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. దాదాపు రెండు నెలలుగా ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారించి పట్టభద్రుల స్థానంలో 56 మంది, ఉపాధ్యాయుల స్థానంలో అభ్యర్థులు 15 మంది బరిలో నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో విభిన్నంగా ప్రచారాలు చేస్తూ ఓటర్లను అకట్టుకునే దిశగా విందు భోజనాలతో సమావేశాలు నిర్వహించారు. గురువారం పోలింగ్ సమయంలో కూడా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే దిశగా డబ్బుల పంపిణీ చేశారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ 2 వేలకు వరకు పంచారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించినా మధ్యాహ్నం వరకు పట్టభ ద్రులు పోలింగ్ కేంద్రాలకు రాకపోవడం గమనర్హం. 12గంటల వరకు కేవలం పట్టభద్రుల ఓటింగ్ 17.17శాతం మాత్రమే జరిగింది. ఉపాధ్యాయులు 40.53శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2గంటల తరువాత ఓటింగ్ శాతం పెరగడం మొదలైంది. 2గంటల వరకు 35.48 శాతం పట్టభద్రులు, 71.16శాతం టీచర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 4గంటల వరకు 68.51 శాతం పట్టభద్రులు 94.63శాతం టీచర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద 3 గంటల తరువాత పట్టభద్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నపిల్లలతో సహా తల్లులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చారు. ఓటింగ్ సరళిని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఉపాధ్యాయ అభ్యర్థి మహేందర్‌రెడ్డిలు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఉపాధ్యాయ సంగాలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి ఓటర్లకు పోల్ చిట్టీలు అందించారు.

● పర్యవేక్షించిన కలెక్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను కలెక్టర్, ఎన్నికల అధికారి సందీప్‌కుమార్ ఝా

మిగతా 8లో


చందుర్తిలో ఓటు వేసిన అక్కాచెల్లెళ్లు

వెళ్లొస్తాం రాజన్నా..

వచ్చే ఏడాది మళ్లీ వస్తాం..

- స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమైన రాజన్న భక్తులు
- పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడాలని మొక్కులు
- ముగిసిన మూడు రోజుల రాజన్న మహాశివరాత్రి వేడుకలు



వేములవాడలో మూడు రోజుల మహాశివరాత్రి వేడుకలు గురువారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 2 లక్షల 55 వేలకు పైగా భక్తులు తరలివచ్చి రాజన్నను దర్శించుకున్నారు. బుధవారం రాత్రి ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద రాత్రంగా జాగరణ చేసిన భక్తులు గురువారం స్వామివారికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మ అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం వెళ్లొస్తాం రాజన్నా.. ఏడాదికి మళ్లీ నీ సన్నిధికి వస్తామంటూ స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు.

7

ప్రజా సంక్షేమానికి కృషి..

- వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్


పట్టభద్రులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

చందుర్తి,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పాలనలో ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నామని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో పట్టభద్రులను గురువారం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్ సరళి చూస్తుంటే పట్టభద్రులందరూ నరేందర్‌రెడ్డికి ఆశీర్వాదాలు ఇస్తున్నట్టుగా ఉందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పెద్దలు నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఎందుకు వేయాలో వివరంగా చెప్పారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీకునే జీతాలు ఇవ్వడం, 60 వేల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. నూతన విద్యా విధానంలో మార్పులు తెస్తూ, రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. రైతు వర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయంతో ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. మొదటి నుంచి బీజేపీకి బీఆర్ఎస్ నుంచి అన్ని విషయాలలో మద్దతుగా ఉందన్నారు. ఇప్పుడు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తమ అభ్యర్థిని పోటీలో పెట్టకుండా బీజేపీకి మద్దతు ఇస్తోందన్నారు. అభివృద్ధితో కాంగ్రెస్ పార్టీ వస్తుంటే.. బీజేపీ మతం పేరుతో వస్తోందన్నారు.

ఆయన వెంట నాయకులు నాగం కుమార్, చింతపంటి రామ స్వామి, బొజ్జ మల్లేశం, గొట్టే ప్రభాకర్, భీమారాజు కనక రాజు, ధర్మపురి శ్రీనివాస్, మ్యాకల గణేష్, ఇల్లంతకుంట గణేష్, పులి సత్తయ్య, శ్రీనివాస్, ఏసుదాసు తదితరులు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం..

- పలుచోట్ల కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తులు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


శివకల్యాణంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

చందుర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్గల్ గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవమూర్తులను పెట్టి కల్యాణాన్ని వేదమంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మడ లక్ష్మనరసింహారావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావులు కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ విండో ఛైర్మన్‌లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, నాయకులు ఎన్గంటి శంకర్, కుసుంబ జనార్ధన్, లాండె తిరుపతి, గుంటి గంగాధర్, పెంటయ్య, ప్రసాద్, శ్రీనివాస్, నగేష్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీసీతారాముల ఆలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ ఆలయమైన మామిడిపల్లి ఆలయంలో శివ కళ్యాణం అర్చకులు కృష్ణహరి ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను సందర్శించారు. ఆలయ ఛైర్మన్ తిరుపతిరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో వెలసిన శ్రీబుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జడ్పీ మాజీ ఛైర్మన్‌లు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాగా, రుద్రంగి మండలం మానాల గ్రామంలోని భవాని శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాగంగా భక్తులకు మహాఅన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం కల్యాణ మహోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు తీసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు కథ కళాకారులు తమ ఆటపాటలతో ఆకట్టున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్) : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీత్రికుటాలయ పురాతన శివాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం ఆలయంలో అత్యంత వైభవంగా అన్నపూజ కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చరలతో చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామ శివారులోని నెమళ్ల గుట్టపై ఉన్న మల్లిఖార్జున స్వామిఆలయంలో గురువారం మల్లన్న కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా అత్యంత వైభవంగా జరిగింది. ఈ జాతరకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామంలోని శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న ఉత్సవాలను ఈసారి ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి యాదవకులానికి చెందిన మహిళలందరూ డప్పు వాయిద్యాలతో బోనాలు తీసుకొని ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం ఆలయంలో ఒగ్గు పూజారులు మల్లన్న పట్నాలు వేసి మల్లన్న కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అలాగే ఆలయంలో పూజారులు మహాలింగార్చన, అన్నపూజలు చేపట్టారు. అలాగే పక్కనగల రేణుక ఎల్లమ్మ ఆలయంలో పట్నాలు వేసి రేణుక ఎల్లమ్మ పండుగను వైభవంగా ఒగ్గు పూజారులు జరిపించారు. తాజా మాజీ కౌన్సిలర్ పోచవేణి సత్య ఎల్లయ్యయాదవ్, యాదవ సంఘం నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానాన్ని నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు, కులస్థులు పాల్గొన్నారు.


రుద్రంగిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్


స్వామివారిని దర్శించుకున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు


మామిడిపల్లి శ్రీసీతారాముల ఆలయంలో శివ కల్యాణం..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు దేవరాజు

ముస్తాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఒల్లెపు దేవరాజు(30) అనే వ్యక్తి వ్యవసాయ బావిలో పూడిక తీత పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌లోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో దేవరాజు పూడికతీత పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడున్న వారు వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దేవరాజుకు భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


లక్ష్మీనర్సు(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన అరె లక్ష్మీనర్సు(54) అనే రైతు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు అనే రైతు కొన్ని రోజుల క్రితం పొలం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ పోవడంతో వేద్దామని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ప్రమాదవశాత్తు షాక్ రావడంతో సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లక్ష్మీనర్సుకు భార్య భూలక్ష్మీ, కొడుకు నవీన్‌లున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ మంత్రి రాజం విజ్ఞప్తి చేశారు.

కొడుకును కాపాడబోయి తల్లికి గాయాలు..

కోనరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నాగారంలో కుమారుడు విద్యుదాఘాతానికి గురికావడంతో కాపాడబోయిన తల్లి విద్యుదాఘాతానికి గురైంది. నాగారం గ్రామంలో విద్యుత్ మెయిన్ వైరు తెగి కింద పడిపోగా ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లిన అద్విక్ తీగను పట్టుకున్నాడు. గమనించిన తల్లి సుమ వైరును తొలగించే ప్రయత్నం చేయగా షాక్ తగిలి కింద పడిపోయింది. గ్రామస్థులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ తల్లీకొడుకులు చికిత్స పొందుతున్నారు.

హత్యకు గురైన వ్యక్తి గుర్తింపు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం చంద్రంపేటలోని రాఘవేంద్ర రైస్‌మిల్ వెనుకాల దారుణ హత్యకు గురైన వ్యక్తి సిరిసిల్ల పట్టణానికి చెందిన బూస రమేశ్ (45)గా కుటుంబ సభ్యులు గురువారం గుర్తించారు. టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. సంఘటనా స్థలంలో పడిఉన్న వస్తువుల ఆధారంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం సేవించినట్లు ఉంది. మద్యం మత్తులో రమేశ్‌ను తలపై బండరాయితో మోది హత్యచేసినట్లు తెలుస్తోంది. రమేశ్‌పై పలు దొంగతనం కేసులు ఉన్నాయి. జులాయిగా తిరిగే రమేశ్‌ను ఎవరు హత్యచేసి ఉంటారనేది తెలియాల్సి ఉంది. రమేశ్‌కు భార్య లావణ్య, కుమార్తె రచన, కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు. పోలీసులు కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు చేసుకొని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని అప్పగించారు. డాగ్ స్క్వాడ్ ఆధారంగా హంతకుల కోసం గాలింపు చేపట్టామని, మరోవైపు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులతో భర్తకు జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్‌ఐ గణేశ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... సిద్దిపేట మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన వనమా యాదగిరికి ముస్తాబాద్ గ్రామానికి చెందిన వనమా లక్ష్మితో 1996 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత యాదగిరి అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేసేవాడు. వేధింపులు భరించలేక 2015 సంవత్సరంలో లక్ష్మి ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వనమా యాదగిరిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో అప్పటి ఎస్‌ఐ మారుతి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా సిఎంఎస్ ఎస్‌ఐ శ్రావణ్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఐదుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ నిందితునికి ఏడాదిన్నర జైలుశిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాన్ ప్రకాష్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెద్దపల్లి పట్టణం క్రిస్టియన్ కాలనీకి చెందిన వల్లెపు జాన్ ప్రకాష్‌తోపాటు వరుసకు సోదరుడైన కరుణాకర్‌లు డిగ్రీ పరీక్షలు రాయడానికి ఉదయం ఏడున్నర గంటలకు బైక్‌పై పెద్దపల్లి నుంచి బయలుదేరారు. సుల్తానాబాద్‌లో కొయ్యడ భాను అనే మరో మిత్రుడిని బైక్‌పై ఎక్కించుకుని ముగ్గురు కరీంనగర్ వెళ్తుండగా దుబ్బపల్లి వద్ద యూటర్న్ తీసుకుంటున్న లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా వీరిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వీరిలో జాన్‌ప్రకాష్ బైక్ నడుపుతుండగా తీవ్ర గాయాలపాలయ్యాడని, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించాడని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళ అంబటి అమృత(52) ప్రమాదానికి గురై కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతిచెందింది. ఆమె రెండో కూతురు స్రవంతి ఆమెరికాలో ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించకుండా వేచిచూడాల్సి వచ్చింది. గురువారం కూతురు స్వగ్రామానికి చేరుకోవడంతో అమృత అంత్యక్రియలను నిర్వహించారు. మృతురాలికి భర్త రాజేందర్, కూతుర్లు సుమతి, స్రవంతి, మానసలు ఉన్నారు.

ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌కు జైలు శిక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు 20 నెలల జైలుశిక్ష, 4 వేల జరిమానా విధిస్తూ గురువారం గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి తీర్పునిచ్చారు. 2016 నవంబరు 19న అల్లూరు సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన పొన్నంగౌడ్(48) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. పొన్నంగౌడ్ భార్య పద్మతో కలిసి ద్విచక్ర వాహనంపై బొక్కలగుట్టకు వెళ్లి తిరిగి వస్తుండగా అల్లూరు సమీపంలో భీమగోని విద్యాసాగర్ వేగంగా ట్రాక్టర్ నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. మృతుడి బావమరిది పులిబాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీస్ సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, ఏసీపీ మడక రమేష్ అభినందించారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

బీర్‌పూర్,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పశువులను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ అరగుండాల ప్రాజెక్టులో పడి పశువులు కాపరి మృతి చెందినట్లు ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఉయ్యాల రాజయ్య(60) అనే పశువుల కాపరికి ఎవరూ లేకపోవడంతో తన సోదరుడి వద్ద ఉంటూ పశువులను కాస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పశువులను మేపడానికి వెళ్లిన రాజయ్య సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తన తమ్ముడు చంద్రయ్య తన కుమారుడు ఉదయ్ కలిసి బుధవారం రాత్రి, గురువారం గాలించగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో అరగుండాల ప్రాజెక్టులో మృతదేహం కనిపించింది. ఈత రాక మృతిచెంది ఉంటాడని రాజయ్య సోదరుడు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూరియా కోసం ఇబ్బందులు

● గొల్లపల్లిలో గోదాంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం ● ఆలూరులో బారులు తీరిన రైతులు ● పైడిమడుగులో కొరతతో ఆందోళన

గొల్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలో యూరి యా కోసం గురువారం రైతులు ఆందోళన చేశారు. గొల్లపల్లి సింగిల్‌విండో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు పలువురు రైతులు యత్నించడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, జిల్లా వ్యవసాయ అధికారి సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గురువారం సింగిల్‌విండో కార్యాలయానికి 350 యూరియా బస్తాలు వచ్చాయనే సమాచారంతో రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కొంత మందికి రైతులకు టోకెన్లు అందజేశారు. టోకెన్లు అందని రైతులు యూరియా కావాలంటూ ఒక్కసారిగా గోదాంలోకి దూసుకు పోయేందుకు ప్రయత్నించారు. సమయం దాటాక ఇచ్చే యూరియా మాకెందుకు అంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సంఘటనాస్థలికి వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి రాంచంద్రం అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు సరిపడా యూరియాను అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. అనంతరం టోకెన్లు పొందిన రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. సింగిల్‌విండో సీఈవో బెజ్జంకి రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ ఐదు లారీల లోడ్‌లకు డబ్బులు చెల్లించామన్నారు. రెండు లారీల యూరియా పంపించారని, దీంతో రైతులు పెద్దఎత్తున రావడంతో కొంత గందరగోళం ఏర్పడిందన్నారు. టోకెన్ ప్రకారం ఒక్కో రైతుకు రెండేసి బస్తాల చొప్పున అందజేశామన్నారు.

● **రాయికల్:** మండలంలోని ఆలూరు గ్రామంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. గ్రామంలోని సహకార కేంద్రంలో రైతులకు సరిపడా ఎరువులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు వారి ఆధార్ కార్డులు, పాస్ బుక్‌లను క్యూలైన్‌లో పెట్టి వేచి చూస్తున్నారు. ప్రభుత్వం కావాల్సిన ఎరువులను సరఫరా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.


పైడిమడుగులో లైనులో ఉంచిన పాస్‌బుక్కులు

● **కోరుట్ల రూరల్:** మండలంలోని పైడిమడుగు గ్రామంలోని సహకార సంఘ భవనం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. చెప్పులు క్యూలో పెట్టుకున్న రైతులు యూరియా కొరకు ఎదురు చూశారు. సింగిల్ విండో కార్యాలయం వద్ద గురువారం ఉదయం రైతులు భారీగా చేరుకున్నారు. యూరియా పంపిణీ చేస్తున్న సయమంలో కేంద్రం వద్ద రైతులు భారీగా చేరడంతో సందడిగా మారింది. సుమారు 400 బ్యాగులు రైతులకు అవసరం ఉండంగా 125 బ్యాగులు రావడంలో ఆవేదన వ్యక్తం చేశారు.


గొల్లపల్లి సింగిల్ విండో వద్ద రైతులు


పైడిమడుగులో బారులు తీరిన రైతులు, క్యూలో చెప్పులు

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ షాపు దగ్ధం

రూ. 8 లక్షల నగదు, రూ. 30 లక్షల సామగ్రి ఆహుతి

మంథని రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగులో గురువారం తెల్లవారుజామున శివశంకర్ కిరాణం, అండ్ జనరల్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన ఊదరి శంకర్ కిరాణ దుకాణంలో మంటలు చెలరేగి నగదుతో పాటు షాపులోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బుధవారం శంకర్ షాపు మూసివేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంథని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంటి మరమ్మతు కోసం అప్పుగా తెచ్చుకున్న రూ.7.80 లక్షల నగదుతోపాటు కౌంటర్‌లో ఉన్న రూ.30 వేలు దగ్ధమైనట్లు బాధితుడు శంకర్ తెలిపారు. సామగ్రి పూర్తిగా దగ్ధమై రూ.30 లక్షల వరకు నష్ట వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


అగ్నిప్రమాదంలో దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధు

పాము కాటుతో రైతు మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట పరిధిలోని బీరంరాజయ్యపల్లికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి(44) గురువారం పాముకాటుతో మృతిచెందాడు. రేవెల్లి శివారులో తన పొలంలో మల్లారెడ్డి పనిచేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని మొదట చొప్పదండి పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మల్లారెడ్డి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

ఇసుక డంప్‌ని పట్టుకున్న పోలీసులు

● ఐదుగురిపై కేసు నమోదు, వాహనాలు సీజ్


ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఓదెల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల శివారు నుంచి ఇసుక అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని, డంప్ చేసిన ఇసుకను పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ బుధవారం రాత్రి పట్టుకున్నారు. పెద్దిరెడ్డి జనార్దన్ రెడ్డి, మణిదీప్, పొన్నగంటి సురేష్, కోరి భాస్కర్, రాజన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, గుంపుల పెట్రోల్ బంక్ పక్కన గల రైస్‌మిల్లు స్థలంలో అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేశారన్నారు. హైదరాబాద్‌కు తరలించడానికి లారీలో ఇసుక లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిలువ చేసిన దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుకపై తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చామని, కొందరు నేరస్తులు ఊక, ఇసుకను కలిపి కంటైనర్ లారీలో తరలిస్తుండగా పట్టుకొన్నామన్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా, ఎవరైనా ఇసుకను అక్రమంగా నిలువ చేసినా, తరలిం చినా చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బోల్తా పడిన లారీ.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ శివారులో అదుపు తప్పి ఉనుక లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఉనుక లారీ అదుపుతప్పి గురువారం బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

● పట్టించుకోని అధికారులు ● సౌకర్యాలు లేక చిన్నారుల అవస్థలు


ఎల్లారెడ్డిపేటలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం-6 అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకైన గదులు, గాలి, వెలుతురు లేక ఉక్కపోత నడుమ చిన్నారులకు అవస్థమయంగా మారింది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. పనులను చేపట్టిన గుత్తేదారు పూర్తి స్థాయిలో చేయకపోవడం వల్ల వినియోగంలోకి రాకుండా పోయింది. తలుపులు తెరచి ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. మద్యం దుకాణానికి సమీపంలోనే అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనంలో మందుబాబులు నిత్యం మద్యం సేవిస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలను అక్కడే పడేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ఆటపాటలతో కళకళలాడాల్సిన కేంద్రం ఖాళీ మద్యం సీసాలతో దర్శనమిస్తోంది. పనులను పూర్తి చేయించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేంద్రానికి నిధులు మంజూరు చేసిన పర్యవేక్షణ లేక అసంపూర్తిగా మిగిలిపోయిందని వాపోతున్నారు. కేంద్ర భవనంలో అసాంఘీక కార్యకలాపాలు సాగుతున్న పోలీసులు దృష్టి సారించకపోవడం ఏమిటనీ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కేంద్రం భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చి అద్దె భవనంలో కొనసాగుతున్న కేంద్రాన్ని స్వంత భవనంలోకి మార్చాలని కోరుతున్నారు.

ఎన్నికల తర్వాత పనులు పూర్తి చేయిస్తాం

- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-6 భవనం అద్దె గదిలో కొనసాగుతోంది. యేడాది కిందట మంజూరైన నిధులతో పనులను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల అనంతరం పనులను పూర్తి చేయిస్తాం. చిన్నారులకు వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపడుతాం.

అలంకారప్రాయంగా రైతు వేదికలు

● ఊరికి దూరంగా.. మందుబాబులకు అడ్డాగా

● నిరుపయోగంగా మారుతున్న కేంద్రాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు అలంకార ప్రాయంగా మారాయి. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం లేక అలంకారప్రాయంగా మిగిలాయి. ఊరికి దూరంగా నిర్మించడంతో కొన్ని రైతు వేదికలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పాలకుర్తి మండలంలోని మూడు రైతువేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం.

బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి రైతువేదికలను నిర్మించింది. వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండేందుకు, సమకాలీన సాగు అంశాలపై ఎప్పటికప్పుడు రైతులతో సమావేశమయ్యేందుకు వీలుగా రైతువేదికలను ఏర్పాటుచేశారు. అయితే ఆ లక్ష్యం నెరవేరడం లేదు. ఎల్కలపల్లి, జయ్యారం, కుక్కలగూడూర్ పేరిట మండలంలో మూడు క్లస్టర్లు మంజూరయ్యాయి. జయ్యారం, ఎల్కలపల్లిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పుట్నూర్, పాలకుర్తిలో, కుక్కలగూడూర్‌లో రైతువేదికలు నిర్మించారు. మూడు రైతువేదికకు ప్రహరీ పూర్తి కాలేదు. గుత్తేదారులు నాసిరకంగా పనులు చేపట్టడంతో పగుళ్లు చూపుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. మంచినీటి సౌకర్యం లేదు. కుర్చీలు, బల్లలు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ నీటి వసతి కల్పించలేదు. గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆయా పంచాయతీల పరిధిలోని రైతులు అక్కడకు వెళ్లడం లేదు. నిర్వహణ లేకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో అవి నిరపయోగంగా మారాయి.

● మండలంలో వ్యవసాయశాఖ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఆ శాఖ అధికారులు రైతువేదికలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో మహిళా ఉద్యోగులతో పాటు మహిళా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.


పాలకుర్తిలోని రైతు వేదిక


పుట్నూర్ రైతు వేదిక వద్ద నిరపయోగంగా మరుగుదొడ్లు

రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

బొడ్డు రాయమల్లు రైతు, కుక్కలగూడూర్

మండలంలో నిర్మించిన మూడు రైతువేదికల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాలకు దూరంగా, కనీసం రోడ్డు సౌకర్యం కల్పించకుండానే రైతువేదికలు ప్రారంభించడంతో నిరుపయోగంగా మారాయి. తాగు నీటి సౌకర్యంతో పాటు రోడ్డు నిర్మాణం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాడుకలోకి తీసుకురావాలి.

వెళ్లొస్తాం రాజన్నా..

వచ్చే ఏడాది మళ్లీ వస్తాం..



- స్వగ్రామాలకు తిరుగుప్రయాణమైన రాజన్న భక్తులు
- పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడాలని మొక్కులు
- ముగిసిన మూడు రోజుల రాజన్న మహాశివరాత్రి వేడుకలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వెళ్లొస్తాం రాజన్నా.. పిల్లాపాపలు, పాడి పంటలను చల్లగా చూడు.. అందరని క్షేమంగా చూస్తే మళ్లీ వచ్చే ఏడాదికి మళ్లీ నీ సన్నిధికి వచ్చి జాగరణ ఉపవాస దీక్ష చేస్తామంటూ భక్తులు వేములవాడ నుంచి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన మహాశివరాత్రి జాతర విజయవంతంగా ముగిసింది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలతో పాటుగా పట్టణ పురవీధులు మూడు రోజులుగా రద్దీగా మారాయి. భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద ఎంతో నిష్ఠతో రాత్రంతా జాగరణ చేసి తెల్లవారి నైవేద్యం పెట్టి దీక్షను విరమించారు.

బద్ది పోచమ్మకు మొక్కులు..

జాగరణ అనంతరం భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అదనంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో త్వరగా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించారు. పట్నాలు వేసి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించి తిరుగు ప్రయాణమయ్యారు.

బియ్యంతో నిండిపోయిన కోటి లింగాలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి దక్షిణం వైపున్న కోటి లింగాలకు భక్తులు ఒడి బియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే మహాశివ రాత్రి జాతరకు లక్షల మంది జనం రావడంతో భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో విగ్రహాలు బియ్యంలో కూరుకు పోయాయి. ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు బియ్యాన్ని తొలగించిన భారీగా తరలివచ్చిన భక్తుల తాకిడికి కోటి లింగాలు బియ్యంతో నిండిపోయి కనిపించాయి. కాగా రాజన్న ఆలయానికి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు తన బంగారు చైన్ పోగొట్టుకోవడంతో పార్వతిపురం ధర్మశాలలోని పారిశుద్య విభాగం సిబ్బందికి దొరకడంతో తిరిగి భక్తులకు అందజేశారు. నిజాయితీని చాటుకున్న సిబ్బందిని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అభినందించారు.

ధర్మగుండంలో తొలగించని వ్యర్థాలు..

మహాశివరాత్రి జాతరకు వచ్చిన భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ ధర్మగుండంలో జాగరణ కోసం పండ్లు, పూలతో దీపాలను వెలిగించారు. గురువారం మధ్యాహ్నం వరకు వ్యర్థాలను సిబ్బంది తొలగించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా శివదీక్ష తీసుకున్న శివస్వాములు తాము ధరించిన దుస్తువులను రాజన్న ఆలయ ధర్మగుండంలో వదిలివెళ్లగా సిబ్బంది తొలగించక పోవడంతో అలాగే ఉండిపోయాయి.

శివమయమైన వేములవాడ క్షేత్రం..

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం బుధవారం శివమయంతో నిండిపోయింది. పట్టణ పురవీధులతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రాజన్న క్షేత్రంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతర ఎంతో వైభవోపేతంగా నిర్వహించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. సుమారుగా 2 లక్షల 55 వేలకు పైగా భక్తులు గురువారం మధ్యాహ్నం వరకు వచ్చినట్లు అంచనా వేస్తున్నాం. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయడం సంతోషంగా ఉంది. జాతర విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అన్ని శాఖల అధికారులతో పాటుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు, రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదం అందజేయడంతో ఎక్కడ లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఏఈవో శ్రావన్‌కుమార్‌కు, ప్రొటోకాల్ ఏఈవో అశోక్, సూపరిండెంట్ శ్రీకాంతచారి, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ యాదవ్, ఎడ్ల శివసాయి, పురాణం వంశీ, జూనియర్ అసిస్టెంట్ సంహాచారిలకు ప్రత్యేక ధన్యవాదాలు.





సరిపోని చలువ పందిళ్లు..

మహాశివరాత్రి జాతరకు అనుకున్న దానికంటే ఎక్కువ మంది తరలిరావడంతో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల సరిపోలేదు. దీంతో భక్తులు గుడి చెరువులోని ఖాళీస్థలాల్లో వెంట తీసుకువచ్చిన పరదాలతో టెంట్‌లను ఏర్పాటు చేసుకుని విడిది చేశారు. మరికొంత మంది భక్తులు రాజన్న గుడి చెరువలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్స్‌ను సపోర్టు చేసుకుని పరదాలను కట్టుకుని ఎండతగలకుండా విడిది చేసి వంటలు చేసుకున్నారు.





స్వామివారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు, వేములవాడ నుంచి తిరుగు ప్రయాణమవుతూ..

శివపార్వతుల శోభాయాత్ర



కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పార్వతీ రాజరాజేశ్వరస్వామి కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి గోదావరిఖని కోదండ రామాలయం నుంచి శివపార్వతుల ఉత్సవవిగ్రహాల శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో, సిబ్బంది, ప్రధానఅర్చకుల అత్తెణ చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో శోభాయాత్ర కొనసాగింది. కేరళ డప్పు చప్పుళ్లతో విద్యుత్ కాంతులతో హంసరథంలో కొనసాగిన యాత్ర విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు.

వేలాల మల్లన్నస్వామి జాతరకు తరలిన భక్తులు

మంథని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాలలో కొలువై ఉన్న మల్లికార్జునస్వామి (మల్లన్న) జాతరకు మంథని ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు గురువారం తరలి వెళ్లారు. మంథని నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన భక్తులు వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఈప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్లి మొక్కులు చెల్లించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు, పట్నాలు, బోనాలు సమర్పిస్తారు.

చెన్నకేశవనాథ స్వామి రథోత్సవం



రాయికల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవనాథ స్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం ఉత్సవ విగ్రహాలైన శివపార్వతులను రథంపై ఉంచి ఆలయం చుట్టూ ఐదుసార్లు తిప్పారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల సందడి



దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

సారంగాపూర్, ఫిబ్రవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలోని దుబ్బరాజన్న క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. అర్చకులు స్వామి వారికి అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి గొడిసెల రాజేశం, సినీ వ్యాపారవేత్త మానాల పుల్లయ్య, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, బాపురెడ్డిలు దర్శించుకున్నారు. శుక్రవారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు.

ఘనంగా సాంబశివ రథోత్సవం



బుగ్గారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండల కేంద్రంలోని సాంబశివ నాగేశ్వర దేవాలయంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్తులు రథాన్ని పూలమాలలతో అలంకరించి శివ భక్తులు, మహిళలు, దీక్ష స్వాములు రథమును లాగారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో నాయకులు బాధినేని రాజేందర్, వేముల సుభాష్, గాలిపెల్లి మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ మసర్ధి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురిలో..



ధర్మపురిలో అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

ధర్మపురి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబశివుడి రథోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అక్కపెల్లి ఆలయం నుంచి గాంధీ చౌక్ మీదుగా నంది విగ్రహ చౌరస్తా వరకు ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం జరిపారు. కార్యక్రమంలో వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, బూస ప్రవీణ్ కుమార్, ద్యావళ్ల ప్రసన్న కుమార్, పర్వతగిరి ప్రశాంత్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెగడపల్లిలో ..



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం శివదీక్షాపరులు, భక్తులచే స్వామి వారి గ్రామ సందర్శనం శోభాయాత్ర నిర్వహించారు. రుద్ర హవనం, జయాదులు, బలిప్రధానం, మహాపూర్ణాహుతి, అన్నపూజ నిర్వహించి 6 వేల మందికి జాల తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్న, ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, గుండి రాజేశ్వర శర్మ, శ్రీనివాస్ శర్మ, వినయ్ శర్మ, రాఘవ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూకంటికి కొలుకలూరి సాహితీ పురస్కారం ప్రదానం



అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వరప్రసాద్

సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కథా రచయిత, కవి, విమర్శకులు జూకంటి జగన్నాథంకు జాతీయస్థాయి కొలుకలూరి భగీరథ కవితా పురస్కారం-2025 ప్రదానం చేస్తూ ఘనంగా సన్మానించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో కొలుకలూరి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేస్తున్న జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్... నాలుగు మేసేజ్‌లు' కావ్య సంపుటికి కొలుకలూరి పురస్కారాన్ని ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌ఛాన్స్‌లర్ మధుజ్యోతి, సుమకిరణ్‌లు పురస్కారాన్ని అందించి సత్కరించారు.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు తల్లీకూతుళ్ల ఎంపిక


కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన తల్లీకూతళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో బుధవారం మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్స్ పోటీల్లో 50 ఏళ్ల పై వయస్సు విభాగంలో తల్లి మేరి స్టెల్లా జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో స్వర్ణ పతకాలు, 100 మీటర్ల పరుగుపందెంలో రజతం సాధించింది. కూతురు షీలాస్మృతి 30 ఏళ్ల పై వయస్సు విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో రజతం, 200 మీటర్ల పరుగు పం దెంలో కాంస్యం సాధించింది. ఏప్రిల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొననున్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు, రూబెన్‌మార్క్, సుధీర్, దేవదానం, డేనియల్, సుదర్శనం, జాన్సన్ అభినందనలు తెలిపారు.



ప్రశంస పత్రాలు అందుకుంటున్న తల్లీకూతుళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి

పరిశోధన ఫలాలు సమాజానికి

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



గణేశ్‌నగర్,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రం మన జీవితాల్లో వెలుగులు నింపుతోంది. సీవీ రామన్ ఫిబ్రవరి 28, 1928న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భౌతిక శాస్త్రంలో సరికొత్త అధ్యయనానికి నాంది పలికారు. ఆ ఆవిష్కరణకు గుర్తుగా ఫిబ్రవరి 28ను 1986 నుంచి జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట అంశం (థీమ్), కొత్త ఆవిష్కరణ లేదా సాంకేతికత ఆధారంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం 'వికసిత్ భారత్‌కే సైన్స్ ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత' అనే అంశంపై జరుపుకుంటున్నారు. ప్రస్తుతం మన దేశం సైంటిఫిక్ రీసెర్చ్ పబ్లికేషన్‌లో ప్రపంచవ్యాప్తంగా మొదటి ఐదు దేశాల్లో ఒకటిగా ఉంది. ఇన్నోవేషన్ ఇండెక్స్ 40వ స్థానంలో ఉంది. చంద్రుడి దక్షిణ ధ్రువం పైకి విజయవంతంగా చేరిన తొలి దేశంగా భారత్ నిలిచింది.

వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు

అన్నదాతలకు సహాయకారిగా ఉండేందుకు శాస్త్ర వేత్తలు ఎన్నో ఆవిష్కరిణలు చేస్తున్నారు. తక్కువ పరిమాణంలో ఉండే నానో యూరియాతో రైతులకు మేలు జరుగుతోంది. సమర్థవంతమైన నానా యూరి యా ఉంటూ పర్యావరణహితంగా సమర్థవంతమైన పాత్ర పోషిస్తుంది. పురుగుల మందులు పిచికారి చేసే డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతు లకు డబ్బులు, సమయం ఆదా అవుతోంది.

విద్యారంగంలో...

కొవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో పాఠాలు కొత్త అధ్యాయనాన్ని ప్రారంభిం చాయి. ఈ విధానంతో ప్ర పంచవ్యాప్తం గా ఉన్న విషయాలను తెలుసుకునే అవకాశం కలిగింది. వర్చువల్ రియాలిటీ, డిజిటల్ బోర్డులు మొదలైన పరికరాల ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ

పెరుగుతున్నకాలుష్యం, వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సమస్యలు మన భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నేపథ్యంలో శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం నూతన ఆవిష్కరణలకై పరిశోధనలు చేస్తూనే ఉన్నారు ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచవ్యాప్తం గా తీవ్ర సమస్యగా మారింది. శాస్త్రవేత్తలు ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి కొత్త పద్ధతులు కను గొంటున్నారు. జలసౌర, పవన విద్యుత్ పునరుత్పాద క ఇంధన వనరులు వినియోగం పెరుగుతుంది.

రవాణా రంగంలో..

వేగవంతమైన, సురక్షితమైన పర్యావరణ అనుకూ లమైన రవాణా వ్యవస్థల కోసం శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో ఎంతో కీలకంగా మారాయి. బ్యాటరీ టెక్నాలజీలో పురోగతి, చార్జింగ్ స్టేషన్ల విస్తరణతో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగిం ది. ప్యానెల్స్ ద్వారా ద్వారా చార్జింగ్ సౌకర్యం, వైర్లెస్ చార్జింగ్ వంటివి అందుబాటులోకి వస్తున్నాయి. డ్రైవర్ లేని వాహనాలు రవాణా రంగంలో పెద్ద మార్పులు తెస్తున్నాయి.

కృత్రిమ మేధస్సు

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం శర వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ అభివృద్ధిలో కృత్రి మ మేధసు ముఖ్యపాత్ర పోషిస్తున్నది.కృత్రిమ మేధ స్సు అనేది కంప్యూటర్, యంత్రాలు మానవుల వలె ఆలోచించి, నేర్చుకొని, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కలిగి ఉండే ఒక సాంకేతికత. ఇది వివిధ రంగాల్లో అనేక శాస్త్రీయ ఆవిష్కరణలకు దారి తీసిం ది. వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు చాలా ఉపయోగపడుతోంది.

సైన్స్ మన జీవితంలో ఒక భాగం

డాక్టర్ తిరుపతి, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్



సైన్స్ మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ఇది మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడానికి అదేవిధంగా కొత్త ఆవిష్కరణలు చేయడానికి సహాయపడుతుంది. జాతీయ సైన్స్ దినోత్సవం అనేది కేవలం ఒకరోజు కాదు, ఇది శాస్త్ర విజ్ఞానం పై మనకున్న నిబద్ధతకు ప్రతీక. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించ డానికి, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించుకోవడానికి ఈ దినోత్సవం స్ఫూర్తినిస్తుంది.

పోలింగ్ ప్రశాంతం..

(5వ పేజీ తరువాయి)

నిరంతరం పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా ఓటింగ్ జరిగే విధంగా సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లాలో 41పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 185 మంది ఎన్నికల నిర్వహణలో పాల్గొన్నారు. ప్రిసైడింగ్ అధికారులు 40 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 40 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది 89 మంది, మైక్రో అబ్జర్వర్లు, 16 మంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు...

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందబోస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్‌ను అమలు చేశారు. 200 మందితో పటిష్టమైన బందోబస్తు నిర్వహించగా ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షించారు. అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్, సీఐలు బందోబస్తు తీరును పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగియడంతో పోలీస్‌లు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఓటింగ్ సరళిపై సర్వత్రా చర్చలు...

ఉత్కంఠభరితంగానే సాగిన ఎమ్మెల్సీ పోరులో ఓటర్ల తీర్పు ముగియడంతో అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు పోలింగ్ సరళిపై చర్చలు మొదలు పెట్టారు. పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, స్వతంత్రులు అశోక్‌కుమార్, మహేందర్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డిల సంబంధించిన చర్చలు జిల్లాలో కొనసాగాయి. వచ్చిన ఓటింగ్ శాతంపై విశ్లేషణలు చేస్తున్నారు.

బీఎస్పీ అభ్యర్థికి బీఆర్ఎస్ ప్రచారం...

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారాలు చేశారు. బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో అభ్యర్థులను బరిలో నిలపలేదు. తటస్థంగా ఉన్నా బీఆర్ఎస్ బుధవారం నుంచి గురువారం పోలింగ్ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆ పార్టీ నాయకులు బీఎస్పీ అభ్యర్థికి మద్ధతుగా పోస్టులు పెట్టడం, ప్రచారాలుచేశారు.

పట్టభద్రుల ఓటింగ్...

మండలం	మొత్తంఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు
చందుర్తి	962	661	362	291
కోనరావుపేట	1496	1012	676	336
రుద్రంగి	392	315	192	123
బోయినపల్లి	1807	1255	856	399
వేములవాడ	3429	2508	1437	1071
వేములవాడ రూరల్	970	695	407	288
సిరిసిల్ల	5117	3304	1965	1339
ఇల్లంతకుంట	1969	1305	828	477
తంగళ్లపల్లి	1561	1028	642	386
వీర్నపల్లి	532	373	243	130
ఎల్లారెడ్డిపేట	1441	956	598	358
గంభీరావుపేట	1226	854	584	270
ముస్తాబాద్	1495	1032	687	345
మొత్తం	22397	15344	9523	5821

ఉపాధ్యాయ ఓటింగ్...

మండలం	మొత్తంఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు
చందుర్తి	28	28	24	04
కోనరావుపేట	35	34	27	07
రుద్రంగి	18	18	15	03
బోయినపల్లి	46	40	32	08
వేములవాడ	177	169	105	64
వేములవాడ రూరల్	27	25	17	08
సిరిసిల్ల	272	257	163	94
ఇల్లంతకుంట	77	67	54	13
తంగళ్లపల్లి	37	37	23	14
వీర్నపల్లి	15	14	12	02
ఎల్లారెడ్డిపేట	82	77	58	19
గంభీరావుపేట	66	65	51	14
ముస్తాబాద్	70	68	59	09
మొత్తం	950	899	640	259

పోలింగ్ కేంద్రం వద్ద పోటాపోటీ ప్రచారం..

వేములవాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శాసనమండలి సభ్యుల ఎన్నిక సందర్భంగా గురువారం వేములవాడలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఓటు హక్కు వినియోగించడానికి పోలింగ్ కేంద్రంలోకి వెళుతున్న వారిని కలిసి నరేందర్ రెడ్డికి ఓటేయాల్సిందిగా కోరారు. పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు నరేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇదిలా ఉండగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మద్దతుగా సీనియర్ నేత జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ నేతృత్వంలో పలువురు నాయకులు ఓటు అభ్యర్థించారు. ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించాలని కోరారు. మరోవైపు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు పట్టభద్రుల నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహించడం కనిపించింది.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది..'

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులతోపాటు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మండల కాంగ్రెస్ నాయకులతో మాటాడి ఎన్నికల పోలింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15నెలల్లో ప్రజలందరికి ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీలను దశలవారిగా నెరవేస్తుందన్నారు. కొత్త రేషన్‌కార్డులను అందించేందుకు ఏర్పాట్లు చేయగా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. మార్చి 1 వతేదీ నుంచి నూతన రేషన్ కార్డులను జారీ చేస్తామని బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారని తెలిపారు. రేషన్ కార్డుల తోపాటు ఇందిరమ్మ ఇళ్లను దరఖాస్తులు చేసుకున్నవారిలో అర్హులకు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల్గాం ప్రవీణ్‌కుమార్, సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరేళ్ల నర్సింగం గౌడ్, మత్స్య శాఖ మండల అధ్యక్షుడు ఇటిక్యాల మహేందర్, మాజీ ఎంపీటీసీలు లింగాల భూపతి, బైరినేని రాము, మచ్చ శ్రీనివాస్, చుక్కా రాజశేఖర్, మోర రాజు, పెద్దూర్ తిరుపతి, కముటం రాజశేఖర్, శ్రీకాంత్‌గౌడ్, వాసు, మునిగెల రాజు, గుగ్గిళ్ల భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మృతుడి కుటుంబానికి చేయూత

గంభీరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో ఇటీవల గొట్టిముక్కుల కిషన్ అనే వ్యక్తి అనారోగ్యంతలో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముదిరాజ్ సంఘం నాయకులు భరోసా ఇచ్చారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గొడుగు శంకర్‌తో పాటు పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం మృతుడు కిషన్ ఇంటికి వెళ్లి వారి భార్యబిడ్డలను పరామర్శించారు. ముదిరాజ్ నాయకులు తలా ఇంతా పోగు చేసి రూ: ప్రస్తుత సహాయం కింద రూ.25వేల నగదును అందజేశారు. దీంతో పాటు 50 కేజీల బియ్యాన్ని కూడా అందజేశారు. వారి వెంట ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మన్, జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు శివంది దేవయ్య, గంభీరావుపేట గౌరవ అధ్యక్షులు నాగరపు దేవేందర్, ఈరవేని రమేష్, ప్రధాన కార్యదర్శి పిట్ల బాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్ల నర్సయ్య, నామాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు చీకోడు నర్సింలు, మండల కమిటీ కోశాధికారి తోక దేవదాసు, సంఘ నాయకులు దండవేని లక్ష్మన్, అరిగె రమేష్, దండవేని నర్సింలు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామంలోని అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద నక్క ప్రణీత్‌యాదవ్ వైద్యానికి గొల్లపల్లిలోని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళీమోహన్‌గౌడ్ గురువారం రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన పరిస్థితిని తెలుసుకున్న మురళీమోహన్‌గౌడ్ మానవత్వంతో స్పందించారు. ప్రభుత్వం, మానవతవాదులు స్పందించి మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు రాము, సురేశ్, స్వామి, దేవయ్య, మల్లయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తారసపడ్డ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యర్థులు..

రుద్రంగి ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని బుగ్గరాజ రాజేశ్వర స్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనరసింహారావులు ఎదురెదురుగా తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరువురు నవ్వుతూ బాగున్నారా.. అంటూ ఒకరికొకరు పలకరించుకున్నారు. కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో వీరిద్దరూ వేములవాడ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.

ప్రలోభాలకు గురిచేసినా పట్టుదలతో ఉన్నారు..

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో జాతీయ పార్టీలు ప్రలోభాలకు గురిచేసినా పట్టభద్రులు పట్టుదలతో ఉన్నారని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రం బయట విలేకరులతో ఆయన మాట్లాడారు.ఈసారి పట్టభద్రులు వేసే ఓటు తెలంగాణ సమాజాన్ని మేలుకొల్పే విధంగా ఉండాలన్నారు. కార్పొరేట్ శక్తులు, పారిశ్రామికవేత్తల ప్రలోభాలకు గురిచేస్తూ మందు, డబ్బులు పంపిణీ చేసినా పట్టభద్రులు కమిట్‌మెంట్‌తో ఉన్నారన్నారు. వార్ ఈస్ వన్‌సైడ్‌గా కామన్‌మెన్ చరిత్ర సృష్టించబోతున్నాడన్నారు. కామన్‌మెన్ రాజకీయాలోకి వచ్చి కమిట్‌మెంట్‌తో పనిచేస్తే ఎలా ఉంటుందో ఈ ఎన్నికల ద్వారా చూస్తారని అన్నారు. పట్టభద్రులైన ఓటర్లు జాగ్రత్తగా విచక్షణతో ఓటు వేయాలని అన్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం..

- ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



వేములవాడలో బారులుతీరిన గ్రాడ్యుయేట్ ఓటర్లు



చందుర్తిలో బారులుతీరిన ఓటర్లు



బోయినపల్లిలో ఓటు వేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ



గంభీరావుపేటలో ఆలస్యంగా వచ్చి వెనుదిరుగుతున్న పట్టభద్రులు

వేములవాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం వేములవాడలో ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేములవాడ అర్బన్ మండలం పట్టభద్రుల ఓటర్ల కోసం నాలుగు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, వేములవాడ రూరల్ మండలంకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు కలిపి ఒకే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తదుపరి ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వేగంగా సాగింది. శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా తరలివచ్చారు. మధ్యాహ్నం తర్వాత ఓటర్ల సంఖ్య పెరగడంతో ఓటు హక్కు వినియోగించుకోవడానికి కనీసం గంటకు పైగా సమయం వేచిచూడాల్సి వచ్చింది. పోలింగ్ కొంత జాప్యంకావడంతో సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా పోలింగ్ స్లిప్పుల పంపిణీ సక్రమంగా సాగకపోవడం, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారం అందకపోవడంతో కొంతమంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. వేములవాడ అర్బన్ మండలంలో 3426 మంది పట్టభద్రులకు 2455 మంది ఓటు హక్కు వినియోగించుపోవడంతో 71.66 శాతం పోలింగ్ నమోదైంది. 176 మంది ఉపాధ్యాయులకు 169మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 96 శాతం పోలింగ్ నమోదైంది. వేములవాడ రూరల్ మండలంలో 970మంది ఉపాధ్యాయులకు 699 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 72 శాతం పోలింగ్ నమోదయింది. 28 మంది ఉపాధ్యాయులకు 25 మంది ఓటు వేయడంతో 89.28శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. వేములవాడలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను ఆర్డీవో ఎస్ రాజేశ్వర్, తహసీల్దార్ మహేష్‌కుమార్ పరిశీలించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు ఎస్పీ చంద్రయ్య పోలింగ్ బందోబస్తును పరిశీలించారు. స్థానిక పట్టణ సీఐ వీర ప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్ బందోబస్తులో పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 77మంది ఉపాధ్యాయ ఓటర్లకు 67మంది, 1969మంది పట్టబద్రుల ఓటర్లకు 1316మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఓటు వేయడానికి ఆసక్తి చూపని పట్టభద్రులు మధ్యాహ్నం భారీగా రావడంతో పోలింగ్ కేంద్రం సందడిగా మారింది. ఎండలో చాలాసేపు నిలబడటంతో అసహనం వ్యక్తం చేశారు. చివరకు అధికారులు టెంట్ వేశారు. పోలింగ్ కేంద్రం బయట కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఇరుపార్టీల నాయకులను పక్కకు పంపించివేశారు. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ అఖిల్‌మహజన్ పరిశీలించారు. తిప్పాపూర్‌కు చెందిన కాదాసు మల్లేశం రోడ్డుప్రమాదంలో గాయపడినా వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేశాడు. చిన్నపిల్లలతో వచ్చిన మహిళలు ఓటువేయడానికి ఇబ్బందిపడ్డారు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో గట్టి భద్రతాచర్యలు చేపట్టారు.

ఆలస్యంగా రావడంతో వెనుదిరిగిన ఓటర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయం ముగిసిన అనంతరం కేంద్రానికి వచ్చిన ఓటర్లను అధికారులు వెనక్కి పంపారు. అనంతగిరి గ్రామానికి చెందిన అరికాల అమర్, చిక్కుడువాణి పల్లె గ్రామానికి చెందిన కోల రమ్యలు నాలుగు గంటల తర్వాత పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. తమ గ్రామాలకు బస్‌సౌకర్యం లేకపోవడం, 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని భావించి ఆలస్యంగా వచ్చినట్లు పేర్కొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు గురువారం ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రవద్ద ఉదయం 8గంటల నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయులు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ, ఉపాధ్యాయల సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. పిల్లాపాపలతో తల్లిదండ్రులు తరలి వచ్చి ఓటు వేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య-హైమావతి దంపతులు కుమారుడితో కలిసి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి ఆయన సతీమణిలు ఓటు వేశారు. ఉదయం మందకొడిగా సాగిన మధ్యాహ్నం 12గంటల తర్వాత ఓటర్లు బారులు తీరారు. ఓటర్లు బారులు తీరడంతో కొందరు పట్టభద్రులు ఓటు వేయకుండానే వెనుదిరిగారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. సాయంత్రం 4గంటలకు పోలింగ్ కేంద్రం ప్రధాన గేటుకు పోలీసులు, అధికారులు తాళం వేశారు. చివరి నిమిషంలో ఇద్దరు పరుగులు తీస్తూ కేంద్రానికి చేరుకోవడం వల్ల లోనికి అనుమతించారు. లోన ఉన్న ఓటర్లు సాయంత్రం 4.38గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకే ముగిసింది. హైదరాబాద్ నుంచి పట్టభద్రుడు ఓటు వేయడానికి వస్తున్నారని ఆయనను అనుమతించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు పోలీసులను కోరగా అనుమతించలేరు. దాంతో పోలీసులతో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. మండలంలో మొత్తం 1441 మంది పట్టభద్రులకు 956 మంది ఓటును సద్వినియోగం చేసుకున్నారు. 82మంది ఉపాధ్యాయ ఓటర్లుండగా 77 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 66.34శాతం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటింగ్ 93.90 శాతం నమోదయిందని తహసీల్దార్ రామచంద్రం తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్బీ డీఎస్పీ మురళీధర్, ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.



ఇల్లంతకుంటలో బారులుతీరిన పట్టభద్రులు

● గంభీరావుపేట : గంభీరావుపేటలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై 10 గంటల వరకు మందకొడిగా సాగింది. 11 గంటల నుంచి పోలింగ్ శాతం పెరిగింది. సాయంత్రం 4గంటల వరకు కొనసాగినా, చివరి సమయంలో 2 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ముగ్గురు పట్టభద్రులు సమయం దాటడంతో ఓటు హక్కు వినియోగించుకోకుండానే వెనుదిరిగారు. మొత్తం 1226 పట్టభద్రులకు 854మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 70 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. 66 మంది ఉపాధ్యాయులు ఉంటే 65 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో టీచర్స్ ఎమ్మెల్సీకి 98.48 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్ పోలింగ్ కేంద్రాన్ని పరిసరాలను సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

గంభీరావుపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 379, 380 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాన్ని, 189 ఉపాధ్యాయ పోలింగ్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు.

● వీర్నపల్లి : మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాం తంగా ముగిశాయి. ఓటర్లు ఓటు వేసేం దుకు పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులను కల్పించినట్లు తహసీల్దార్ మారుతిరెడ్డి తెలిపారు. ఎస్సై ఎల్లయ్యగౌడ్ ఆధ్వర్యం లో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశా రు. పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీశారు. పోలింగ్ కేం ద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. మం డలంలో మొత్తం 532మంది పట్టభద్రు ల ఓటర్లకు 373మంది ఓట్లువేసి 70.11 శాతం ఓటు హక్కును వినియోగించు కున్నారు. అలాగే 15మంది ఉపాధ్యాయులకు 14 మంది ఓట్లు వేసి 93.33 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 1495 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా, 1034 ఓట్లు నమోదయ్యాయి. పోలింగ్ శాతం 69.70 శాతం నమోదయింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 70 ఓట్లు ఉండగా 68 ఓట్లు నమోదయ్యాయి. 97శాతం మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం వరకు ఓటింగ్ మందకోడికి సాగింది. మధ్యాహ్నం దాటాక ఓటర్లు బారులు తీరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డి క్యూలైన్‌లో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సీహెచ్ గణేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రారంభం అయినప్పటికీ 11 గంటల వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మొత్తం పట్టభద్రుల ఓట్లు 1496 వినియోగించుకున్న ఓట్లు 1010 కాగా 67 పోలయ్యాయి. ఉపాధ్యాయుల మొత్తం ఓట్లు 35ఉండగా 34 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోగా 97శాతం పోలయ్యాయి.

● చందుర్తి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో పట్టబద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. చివరి గంటలో పోలింగ్ కేంద్రం దగ్గర భారీగా క్యూలు కనిపించాయి. 4గంటల లోపు క్యూలో ఉన్నవారికి అధికారులు ఓటేసే అవకాశం ఇచ్చారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 100 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. ఉదయం నుంచి పోలింగ్లో టీచర్లు పాల్గొన్నారు. మండలంలో మంది ఉపాధ్యాయులకు 28 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 962 మంది పట్టభద్రులకు 707 మంది పట్టభద్రులు 73.49 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు..

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఏఎస్పీ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏదైనా శాంతిభద్రతల సమస్య తలెత్తితే వెంటనే అందుబాటులో ఉండే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వెంట ఎస్సై అంజయ్య ఉన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రుద్రంగిలో 392 మంది పట్టుభద్రుల ఓటర్లు ఉండగా స్త్రీలు 3584, పురుషులు 2621 మొత్తంగా 315మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.12 శాతం పోలింగ్, టీచర్స్ ఎమ్మెల్సీలో 18 టీచర్స్ ఓటర్లు ఉండగా 18 మంది ఓటు హక్కు వినియోగించుకోని 100 శాతం పోలింగ్ జరిగిందని మండల ఎన్నికల ఆధికారులు తెలిపారు. ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సిరిసిల్ల ఆశోక్ బందోబస్తు నిర్వహించారు.

రుద్రంగి మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పరిశిలించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు, ఎస్ఐ సిరిసిల్ల ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్



ఎల్లారెడ్డిపేటలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్న కేకే మహేందర్‌రెడ్డి, తోట ఆగయ్య